క్లుప్తంగా

ఎల్బీ కళాశాలలో నెక్ డే

రామన్నపేట: వరంగల్ ములుగు రోడ్డులోని లాల్‌బహదూర్ కళాశాలలో పౌల్ట్రీ విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన నెక్ డే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్డు తినడం వల్ల కలిగే లాభాలను వివరించారు. నెక్ డే జరుపుకోవడానికి గల కారణాలను వివరిస్తూ బీవీ.రావు గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, మధుకర్‌రావు, రమణరెడ్డి, రవీందర్, సుధాకర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నియామకం

రామన్నపేట: తెలంగాణ రాష్ట్ర వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా తోనుపునూరి వీరన్నను నియమిస్తూ రాష్ట్ర వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పుల శ్రీనివాస్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు వరంగల్‌లోని వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు గట్టు మహేష్‌బాబు స్వగృహంలో వీరన్నకు సోమవారం నియామక పత్రం అందించారు. జిల్లా అధ్యక్షుడు పుల్లూరి మధు, ప్రధాన కార్యదర్శి గుమ్మడవెల్లి సురేష్, ఎలగందుల రాజేందర్, వల్లాల శైలజ, బిజ్జాల నవీన్, మల్యాల వీరమల్లయ్య, తోట హరీశ్, అయిత ప్రసాద్, నరేష్, వల్లాల నాగేశ్వర్‌రావు, బెలిదె వెంకటేశ్వర్లు, జందు నాగేందర్, కుంచం శివకుమార్, సుద్దాల రమేష్, మురళి, శ్రీధర్ పాల్గొన్నారు.

శ్యామల దుర్గాదాస్ కాలనీ కమిటీ ఎన్నిక

హన్మకొండ: శ్యామల దుర్గాదాస్ కాలనీలోని పార్కులో శ్యామల దుర్గాదాస్ కాలనీ కమిటీ సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధి కమిటీని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా పొన్నోజు వీరబ్రహ్మచారి వ్యవహరించారు. అధ్యక్షుడిగా నల్లాని శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడిగా పొన్నోజు వీర బ్రహ్మచారి, ఉపాధ్యక్షుడిగా తంగళ్లపల్లి శంకరాచారి, ప్రధాన కార్యదర్శిగా బొద్దిరెడ్డి శ్రీరామ్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా రొయ్యల సత్యం, కోశాధికారిగా గూడూరు రవీందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా కటకం శివప్రసాద్, రాంపల్లి రాజాప్రభు, నల్ల ప్రసాద్, చెన్నూరి బాబురావు, వనం రమేష్ ఎన్నికయ్యారు.

బస్సు ఢీ.. యువకుడి మృతి

హసన్‌పర్తి: ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ యువకుడు దుర్మరణం చెందిన సంఘటన హనుమకొండ – కరీంనగర్ ప్రధాన రహదారిలోని హసన్‌పర్తి గ్రంథాలయం సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. హసన్‌పర్తికి చెందిన పిట్టల కృష్ణ (34) స్థానిక చేపల కంపెనీలో కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇంటికి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా కరీంనగర్ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు.. అతన్ని ఢీకొంది. దాంతో కృష్ణ అక్కడక్కడే మృతి చెందాడు. దాంతో సుమారు అరగంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు ఘటన స్థలాన్ని చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ఎన్నికల ప్రచారం ముమ్మరం

ఎన్నికల సమయం దగ్గర పడుతున్నా కొద్దీ పార్టీ అభ్యర్థులు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా తమ నియోజకవర్గంలో కలియ తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ప్రజలకు పార్టీ మేనిఫెస్టోను వివరిస్తూ భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతున్నారు. బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో గుడిసె వాసుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా గుడిసెవాసుల సమస్యలను పరిష్కరిస్తానని బీఆర్ఎస్ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ హామీఇచ్చారు. అలాగే, 'మా పాలిట దైవం వినయన్న' పాటల సీడీని ఆయన ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి నాయిని రాజేందర్ రెడ్డి.. హనుమకొండలోని 4వ డివిజన్‌లో ప్రజా దీవెన యాత్ర నిర్వహించారు. దాంతో కాజీపేటకు చెందిన పలువురు కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. హనుమకొండలోని నాగేంద్రనగర్, రెవెన్యూ కాలనీ, కాజీపేటలోని బాలాజీనగర్, డీజిల్‌నగర్ ప్రాంతాల్లో బీజేపీ వరంగల్ పశ్చిమ అభ్యర్థి రావు పద్మ ఇంటింటి ప్రచారం చేశారు. తనకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు కంభంపాటి కుమారస్వామి, కటకం పెంటయ్య, అడ్తి, ఖరీదుదారులు సాగర్ల శ్రీనివాస్, గజ్జల శ్యామ్, కంచ సంపత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ వరంగల్ తూర్పు అభ్యర్థి కొండా సురేఖ.. మిర్చి, పత్తి, అపరాల యార్డుల్లో ఎన్నికల ప్రచారం చేశారు. తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. 18వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బల్ల సదానందం కాంగ్రెస్ పార్టీలో చేరగా, ఆయనకు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మూడోసారి బీఆర్ఎస్‌కు పట్టం కట్టబెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బొక్క కుమార్, మాజీ వార్డు సభ్యురాలు మార్తమ్మతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో వారిని ఆయన ఆహ్వానించారు. ఎల్లాపురం, మునిపల్లి, జయగిరి, అన్నాసాగరం, మడిపల్లి, దేవన్నపేటల్లో కాంగ్రెస్ వర్ధన్నపేట అభ్యర్థి కేఆర్.నాగరాజు ప్రచారం చేశారు. హసన్‌పర్తి మండలంలోని హరిశ్చంద్రనాయక్ తండాల్లో బీజేపీ వర్ధన్నపేట నియోజకవర్గ అభ్యర్థి కొండేటి శ్రీధర్ ఇంటింటికి తిరుగుతూ ఓటు అడిగారు.

– సాక్షి నెట్‌వర్క్

సృజనాత్మకతను వెలికి తీసేందుకు

'సాక్షి స్పెల్‌బీ' దోహదం



స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న షైన్ హైస్కూల్ విద్యార్థులు



పరీక్ష రాస్తున్న రామన్ హైస్కూల్ చిన్నారులు

హన్మకొండ: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు 'సాక్షి స్పెల్‌బీ' ఎంతగానో దోహదపడుతుందని సాక్షి దినపత్రిక వరంగల్ యూనిట్ బ్రాంచీ మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. సాక్షి ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భవిష్య హైస్కూల్, షైన్‌గ్రూప్ ఆఫ్ స్కూల్స్, తాళ్ల పద్మావతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్, బిర్లా ఓపెన్ మైండ్ ఇంటర్నేషనల్ స్కూల్, సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్, రామన్ హైస్కూల్, స్టాండర్డ్ హైస్కూళ్లలో స్పెల్ బీ ప్రాథమిక స్థాయి పరీక్షను సోమవారం నిర్వహించారు. ఈ పరీక్షకు పలు పాఠశాలల నుంచి పలువురు విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభా పాటవాలను పరీక్షించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పోటీ పరీక్షలో పాల్గొనాలనే ఆసక్తి గల విద్యార్థులు 95055 14424 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ గడ్డం రాజిరెడ్డి, ఈవెంట్స్ మేనేజర్ ఎస్.సుమన్ గుప్తా, ఎడిషన్ ఇన్‌చార్జ్ లింగయ్య, సాక్షి బృందం సభ్యులు పాల్గొన్నారు. కాగా, స్పెల్‌బీ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు తమ అభిప్రాయాలను సాక్షితో పంచుకున్నారు.

జిల్లా స్థాయి పోటీల కోసం ప్రయత్నిస్తా..



సాక్షి ప్రాథమిక స్థాయి స్పెల్‌బీ పోటీ పరీక్షలో పాల్గొన్న అనుభవంతో జిల్లా స్థాయిలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తా. సాక్షి దినపత్రిక నిర్వహిస్తున్న స్పెల్ బీ పరీక్షల్లో పాల్గొనడంతో పోటీ పరీక్షలంటే భయం పోయింది.

– ఆరాధ్య, 7వ తరగతి, బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్

మొదటిసారి పరీక్ష రాశా..



సాక్షి స్పెల్‌బీ పరీక్షను తొలిసారి రాశాను. నాకు చాలా ఆనందంగా ఉంది. ఈ ప్రాథమిక పరీక్షలో నెగ్గి జిల్లా స్థాయికి ఎంపిక అవుతాననే నమ్మకం కూడా ఉంది. ఇలాంటి పరీక్ష నిర్వహించినందుకు సాక్షికి కృతజ్ఞతలు.

– అద్వైత్, 4వ తరగతి, స్టాండర్డ్ హైస్కూల్

ప్రతీ విషయంపై పట్టు



సాక్షి స్పెల్‌బీ పరీక్ష రాయడం వల్ల కొత్త విషయాలు తెలిశాయి. ప్రతీ విషయంపై పట్టు ఎలా సాధించాలో అవగతం అయింది. భవిష్యత్తులో పోటీ పరీక్షలు, ఉన్నత చదువులకు ఈ పరీక్ష ఎంతగానో దోహదపడుతుంది.

– రితుష్నా రెడ్డి, 3వ తరగతి, సెయింట్ పీటర్స్ స్కూల్

ఆంగ్లమంటే భయం పోతుంది



ఇలాంటి పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల ఆంగ్లమంటే భయం పోతుంది. సాక్షి స్పెల్‌బీ పరీక్ష సృజనాత్మకతను వెలికితీసేందుకు ఉపయోగపడుతుంది. విద్యార్థులకు ఎంతగానో దోదహపడుతుంది.

– గయాసుద్దీన్, 6వ తరగతి, షైన్ హైస్కూల్

పరీక్షతో ఉత్సాహం పెరిగింది



సమాజంలో పోటీ అనేది ఏ స్థాయిలో ఉంటుందో స్పెల్‌బీ ద్వారా అర్థం అయింది. పైస్థాయిలోకి చేరుకుంటే ఉత్సాహం పెరిగి మరింత శ్రద్ధ పెట్టేందుకు వీలు అవుతుంది. మంచి ఫలితం సాధించేందుకు బాగా కష్టపడాలి.

– సమన్వి, 4వ తరగతి, తాళ్ల పద్మావతి స్కూల్

తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు..



స్పెల్‌బీ పరీక్షల్లాంటివి రాయడం వల్ల మంచి భవిష్యత్ ఉంటుందని నమ్మకం. ఆ నమ్మకంతో మా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. ఇలాంటి పరీక్షల వలన ఇంగ్లిష్ నేర్చుకోవాలనే ఉత్సాహం కూడా పెరుగుతుంది.

– అనన్య 9వ తరగతి, భవిష్య హైస్కూల్

అక్రమంగా మద్యం నిల్వ చేస్తే చర్యలు



తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు



కారును తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ సురేష్‌గౌడ్

ఖిలా వరంగల్: అక్రమంగా మద్యం నిల్వచేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ హెచ్చరించారు. ఈనెల 30న జరగనున్న ఎన్నికల్లో భాగంగా ప్రొహిబిషన్ ఎక్సైజ్ వరంగల్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు ఖిలా వరంగల్ ఎక్సైజ్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఖిలా వరంగల్ త్రికోట, శివనగర్, ఉర్సు, స్తంభంపల్లి, రైస్ మిల్లులు, కోళ్లఫారాలు, గోదాముల్లో సోమవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ మాట్లాడుతూ మద్యం అక్రమంగా నిల్వ చేసినట్లు తెలిస్తే వెంటనే ఎక్సైజ్ శాఖ టోల్ ఫ్రీ నంబర్ 18004252523, ఎస్‌హెచ్‌ఓ నంబర్ 87126 59021కు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారిపేరును అత్యంత గోప్యంగా ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై రేష్మాసుల్తాన, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వాహనం తనిఖీ

వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ వాహనాన్ని శంభునిపేట జంక్షన్‌లో పోలీసులు తనిఖీ చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రాత్రి వరంగల్ 37వ డివిజన్ దూపకుంట రోడ్డులోని గిరిప్రసాద్‌నగర్‌కు వెళ్లి తిరిగి ఫోర్ట్‌రోడ్డు పెరకవాడలోని క్యాంప్ ఆఫీస్‌కు కారులో ఎమ్మెల్యే బయల్దేరారు. ఈ క్రమంలో ఆయన కారును మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ సురేష్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేసి వదిలేశారు.

ఓటు వినియోగంతోనే ప్రశ్నించే హక్కు



మాట్లాడుతున్న అనితారెడ్డి

హన్మకొండ: ఓటు హక్కును వినియోగించుకోకపోతే ప్రశ్నించే హక్కును కోల్పోవడమేనని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు, నేషనల్ కన్జూమర్ రైట్స్ కమిషన్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ కే.అనితారెడ్డి అన్నారు. హనుమకొండ కేఎల్ఎన్ రెడ్డి కాలనీలోని స్వధార్ మహిళా ఆశ్రమంలో ఓటు విలువపై మహిళలకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరి భాగస్వామ్యంతో నగరంలో నూరుశాతం ఓటింగ్ జరిగే విధంగా కృషి చేయాలని కోరారు. ఈక్రమంలో ఓటుహక్కు ఉన్న వారంతా విధిగా వినియోగించుకోవాలని చెప్పారు. వజ్రాయుధంలాంటి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం, స్వేచ్ఛగా ఓటు వేస్తామని మహిళలతో అనితారెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు, మహిళలు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు చేయూత



మహిళలకు బియ్యం, చీరలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

హసన్‌పర్తి: నిరుపేద కుటుంబాలకు లయన్స్ క్లబ్ హసన్‌పర్తి ఆధ్వర్యంలో చేయూతనిచ్చారు. ఒక్కో కుటుంబానికి 25కిలోల బియ్యంతో పాటు చీర అందించారు. హసన్‌పర్తిలోని రాజరాజేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో తోట సక్కుబాయి – సారంగం షష్ఠి పూర్తి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా లయన్స్ లీడరిస్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ అజిత్‌కుమార్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ముందు వరుసలో ఉందని వివరించారు. క్లబ్ అధ్యక్షుడు ఎల్కరాజు శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు తోట సంపత్, డాక్టర్ శేఖర్, కందుకూరి చంద్రమోహన్, వీసం కర్ణాకర్‌రెడ్డి, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాల్మీకి మహర్షి రథోత్సవం



వాల్మీకి మహర్షి రథోత్సవంలో కులస్తులు

మడికొండ: వాల్మీకి నవరాత్రోత్సవాల సందర్భంగా తొమ్మిది రోజుల అనంతరం సోమవారం రథోత్సవాన్ని అర్చకుల మంత్రోచ్చరణల మధ్య వాల్మీకి సంఘం పెద్దలు ప్రత్యేక పూజలు చేసి ప్రత్యేక వాహనంలో రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రథోత్సవానికి మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం వాల్మీకి చిత్రపటాన్ని తిరిగి వాల్మీకి భవనానికి తరలించారు. కార్యక్రమంలో 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధిక రెడ్డి, వాల్మీకి సంఘం అధ్యక్షుడు బోగి లింగమూర్తి, బోగి కృష్ణమూర్తి, కంచనపల్లి వెంకటయ్య, నిగ్గుల వెంకట ప్రసాద్, బోగి లింగయ్య, కుర్ల మోహన్, సాంబయ్య, నిగ్గుల రవి, మినుగు సతీష్, పెనుకుల రవి, డిపో రాజు, దేవరాజ్, కుల సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

కాశీబుగ్గ/కాళోజీ సెంటర్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.సోమశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని హంటర్‌రోడ్డులోని టీఎస్‌యూటీఎఫ్ వరంగల్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు తాటికాయల కుమార్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడారు. ఈ సందర్భంగా కె.సోమశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుతామని, విద్యారంగం పట్ల తమ విధివిధానాలను అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో ప్రకటించాలని కోరారు. అనంతరం జిల్లా నూతన ప్రధాన కార్యదర్శిగా సి.సుజన్ ప్రసాద్, కోశాధికారిగా ఎస్ఏ రావూఫ్, కార్యదర్శిగా జి.విజయ్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా గుండు కర్ణాకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి బద్దం వెంకటరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మేకిరి దామోదర్, ఎం.అన్నాదేవి, కార్యదర్శులు బి.వెంకటేశ్వరరావు, టి.లింగమూర్తి, పాక శ్రీనివాస్, కె.రవీందర్, నామోజు శ్రీనివాస్, పోశాల కుమారస్వామి, జిల్లా కమిటీ సభ్యులు బి.నరసింహారావు, వేణుమాధవ్, టీవీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎంసీపీఐ (యూ) ర్యాలీ

హన్మకొండ: ఎంసీపీఐ (యూ) వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం నాగార్జున సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నామినేషన్ వేసేందుకు వేయిస్తంభాల గుడి నుంచి హనుమకొండలోని ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, గోనె కుమారస్వామి, ఎస్ రెడ్డి.హంసారెడ్డి, పెద్దారపు రమేష్, మాస్ సావిత్రి, నీల రవీందర్, నర్ర ప్రతాప్, కన్నం మొగిలి, వంగల రాగసుధ, కనకం సంధ్య, వెంకన్న, భద్రయ్య, కుమారస్వామి, ఇస్మాయిల్, సుధారాణి, వెన్నెల, మణిమాల, అశ్విని, పార్వతి, లావణ్య, రాధిక, మల్లేష్, సుధాకర్, రవి పాల్గొన్నారు.

బీసీలపై బీఆర్ఎస్ వైఖరి స్పష్టం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శేషు

హన్మకొండ: బీసీల అభివృద్ధి, సంక్షేమంపై బీఆర్ఎస్ తన వైఖరి స్పష్టం చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు డిమాండ్ చేశారు. హనుమకొండ సుబేదారిలో బీసీ జేఏసీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల పట్ల బీజేపీ తన వైఖరిని స్పష్టం చేసిందని, కాంగ్రెస్ వైఖరిని స్పష్టం చేయబోతోందని, ఈ క్రమంలో బీఆర్ఎస్ కూడా వెల్లడించాలని సూచించారు. బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆంక్షలు విధించి పూర్తి ఫీజు చెల్లించకుండా అన్యాయం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. పూలే విదేశీ విద్యాజ్యోతి పథకం కింద విదేశాలకు వెళ్లే బీసీ విద్యార్థుల సంఖ్యను పెంచే హామీ కూడా ఇవ్వాలని కోరారు. శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కేవలం 22 మంది బీసీలకు మాత్రమే అవకాశం కల్పించి అన్యాయం చేసిందని వాపోయారు. సమావేశంలో బీసీ నాయకులు రమేష్, నరేందర్ చారి పాల్గొన్నారు.

దివాళి ఉత్సవాలకు ఏర్పాట్ల పరిశీలన



మైదానాన్ని పరిశీలిస్తున్న ఏసీపీలు, కార్పొరేటర్

కరీమాబాద్: ఈనెల 11న దీపావళి పండుగను పురస్కరించుకుని వరంగల్ ఉర్సు రంగలీల మైదానంలో నరకాసుర వధ నిర్వహించనున్నారు. ఈక్రమంలో ఆ ప్రాంతంలో ఉత్సవాల ఏర్పాట్లను వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, ట్రాఫిక్ ఏసీపీ భోజరాజు సోమవారం పరిశీలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బందోబస్తు గురించి నిర్వాహకులకు వివరించారు. కార్యక్రమంలో 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి, మిల్స్‌కాలనీ సీఐ సురేష్, ట్రాఫిక్ సీఐ వెంకన్న, ఎస్సై రణధీర్‌రెడ్డితోపాటు ఉత్సవ కమిటీ సభ్యులు కనుకుంట్ల రవి, రాంమూర్తి, గౌతం, సురేష్, బాల కొమురెల్లి, నరసింహ, రంజిత్, రాజు, అఖిల్, సాయి, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కేయూలో కొండచిలువల సంచారం



కేయూలో ప్రత్యక్షమైన కొండ చిలువ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిసరాల్లో పలు కొండచిలువలు సంచరిస్తున్నాయి. ఆదివారం రాత్రి ఓ కొండచిలువ క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాల – జియాలజీ విభాగం మధ్యలో సంచరిస్తున్న సమయంలో ప్రొఫెసర్ సమ్మయ్య, పలువురు వాకర్స్ చూశారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ హాస్టల్ – క్వార్టర్స్ మధ్యలో కూడా గతంలో కొండ చిలువలు ప్రత్యక్షమయ్యాయి. బయో టెక్నాలజీ, కెమిస్ట్రీ, ఇలా పలుచోట్ల కొండ చిలువలు సంచరించటంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఈక్రమంలో కొండ చిలువలను అటవీశాఖ అధికారులు గుర్తించి అటవీ ప్రాంతాల్లో వదిలేలా యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

'ఐపీఎస్ అధికారి'కి ఘన సన్మానం



సాయికిరణ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

హసన్‌పర్తి: హసన్‌పర్తిలోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో చదివి ఐపీఎస్ అధికారిగా ఎంపికైన పత్తిపాక సాయికిరణ్‌ను పాఠశాల ఆవరణలో ఆదివారం రాత్రి సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ భరద్వాజ్ నాయుడు మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. సన్మాన గ్రహీత సాయికిరణ్ మాట్లాడుతూ క్రమశిక్షణతోనే ఉన్నతస్థాయికి ఎదిగినట్లు చెప్పారు. సాయికిరణ్‌తోపాటు అతని తండ్రి కొమురయ్యను కూడా అభినందించారు. కాగా, 2022 సివిల్ సర్వీసెస్ బ్యాచ్‌కు చెందిన సాయికిరణ్ ప్రస్తుతం శిక్షణలో ఉన్నారు. కార్యక్రమంలో పాఠశాల జనరల్ మేనేజర్ ఎం.ప్రభుకుమార్, అకడమిక్ ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ప్రిన్సిపాల్ పవన్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, ఫైనాన్స్ ఆఫీసర్ షేక్ రబ్బాని, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే క్యాంటీన్ పునఃప్రారంభం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే స్టేషన్‌లో ఒకటవ నంబర్ ప్లాట్‌ఫాంలో వీఐపీ లాంజ్ పక్కన ఉన్న రైల్వే క్యాంటీన్‌ను పునఃప్రారంభించినట్లు రైల్వే కమర్షియల్ అధికారులు సోమవారం తెలిపారు. పలు అనివార్య కారణాలతో నెలక్రితం తాత్కాలికంగా మూసివేసిన రైల్వే క్యాంటీన్‌ను రెండు రోజుల క్రితం తిరిగి పునఃప్రారంభించినట్లు తెలిపారు. ఇకనుంచి క్యాంటిన్ తెలిసే ఉంటుందని చెప్పారు. దాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని రైల్వే అధికారులు కోరారు.

నవచేతన పుస్తక ప్రదర్శన ప్రారంభం



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న లక్ష్మణ్

హన్మకొండ: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు, బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండలోని అశోకా కాంప్లెక్స్‌లోని నవచేతన (విశాలాంధ్ర) బుక్ హౌస్‌లో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను డీపీఆర్‌ఓ ఏడీ లక్ష్మణ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలు విజ్ఞానాన్ని పెంపొందించి, మనిషి జీవితాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతాయని వివరించారు. ప్రతీఒక్కరు పుస్తక పఠనాన్ని నిరంతర అలవాటుగా చేసుకోవాలని సూచించారు. నవచేతన విజ్ఞాన సమితి సభ్యురాలు ఎస్.జ్యోతి మాట్లాడుతూ పుస్తక ప్రదర్శన ఈనెల చివరి వరకు కొనసాగుతుందని చెప్పారు. పుస్తకాలపై 10నుంచి 30శాతం వరకు ప్రత్యేక రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ఎస్.శ్రీధర్, సీపీఐ జిల్లా కార్యదర్శి భిక్షపతి, రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శంకర్‌నారాయణ, గడ్డం కేశవమూర్తి, తిరుపతిరెడ్డి, మురళి, బండి మొగిలి, టీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, బుక్ హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌పై కేసు నమోదు చేయాలి



మాట్లాడుతున్న జడ్సన్

మడికొండ: రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కల్వకుంట్ల కేటీఆర్‌పై కేసు నమోదు చేయాలని ఏఐసీసీ మాజీ సభ్యుడు బక్క జడ్సన్ డిమాండ్ చేశారు. ఈమేరకు మడికొండ పోలీసులకు సోమవారం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లో ఏర్పాటు చేస్తున్న ఫాక్స్ కాన్ కంపెనీకి కేటీఆర్ భూమి పూజ చేశారని చెప్పారు. పరిశ్రమ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం 196 ఎకరాల స్థలాన్ని కేటాయించిందని తెలిపారు. అయితే భూములు, నిధులను కాజేయడానికి ప్రభుత్వం నాటకం ఆడుతోందని ఆరోపించారు. దీనిపై దర్యాప్తు చేయాలని సీబీఐని కోరినట్లు జడ్సన్ తెలిపారు.